క్లుప్తంగా

కనులపండువగా వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): స్థానిక పూర్ణానందంపేటలోని కోదండరామ దాసాంజనేయస్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ఆధ్యాత్మికవేత్త, ఆలయ ట్రస్టీ కన్వీనర్ వేముల హజరత్తయ్య గుప్తా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ కోదండరామ దాసాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో 37 సంవత్సరాల క్రితం పులిపాటి దుర్గారావు, కోటేశ్వరమ్మ దంపతులచే శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారి వారసులు దుర్గాప్రసాద్ విజయకుమారి, సాయిరామ్ ఉషారాణి దంపతులు స్వామి వార్ల చేతుల మీదుగా స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాలు కలిగి ఉండాలని శ్లోక భావ యుక్తంగా తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసదాలు, అన్నప్రసాదాన్ని అందజేశారు.

హోల్ సేల్ మెడికల్ డీలర్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆలిండియా అసోసియేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడ నక్కల్ రోడ్డులోని యూనిటీ హాస్పిటల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ది కృష్ణా జిల్లా హోల్ సేల్ డ్రగ్గిస్ట్స్ అండ్ కెమిస్ట్స్ హోల్ సేల్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు డీలర్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సీసీ కేశవరావు, కార్యదర్శి పల్లపోతు మురళీకృష్ణ, కోశాధికారి గర్రె సురేష్ మాట్లాడుతూ జగన్నాథ్ షిండే చేసిన సేవలను ప్రశంసించారు. జాతీయ స్థాయిలో డీలర్ల సమస్యల పరిష్కారానికి షిండే ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయన పుట్టిన రోజు నాడు దేశవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించినట్లు తెలిపారు. రక్తదాతలకు అభినందనలు తెలిపారు.


యోనెక్స్ సన్‌రైజ్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేత షరిష్మ



విజయవాడస్పోర్ట్స్: యోనెక్స్ సన్‌రైజ్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీలో విజయవాడ క్రీడాకారిణి తమిరి సూర్యషరిష్మ సత్తా చాటింది. బెంగుళూరులో ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు జరిగిన ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. సింగిల్స్ ఫైనల్స్‌లో మానసి సింగ్(ఉత్తరప్రదేశ్)ను షరిష్మ 21–18, 23–21(2–0) తేడాతో ఓడించి విన్నర్ ట్రోఫీని అందుకుంది. క్రీడాకారిణి షరిష్మ ఎనిమిదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) కోచ్ కె.భాస్కర్ వద్ద శిక్షణ తీసుకుంటోంది. జాతీయ ట్రోఫీ సాధించిన షరిష్మకు ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీవో ఎస్.ఎ.అజీజ్ అభినందనలు తెలిపారు.

సమాజానికి బాలికలే భవిష్యత్తు

ఏసీపీ లత కుమారి



పటమట(విజయవాడతూర్పు): సమాజానికి బాలికలే భవిష్యత్తని విజయవాడ మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ లత కుమారి తెలిపారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్టెల్లా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడపిల్లలు, మగ పిల్లలు అనే లింగ భేదం లేకుండా పిల్లలను పెంచాలని సూచించారు. పోటీ ప్రపంచంలో ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం తప్పనిసరి అయిందన్నారు. ప్రతి కుటుంబం నుంచి సాంకేతిక నిపుణులు రావాలని, అందులో ఆడపిల్లలు అధికసంఖ్యలో ఉండాలని పేర్కొన్నారు. జాతీయ బాలిక దినోత్సవం పోస్టర్ ఆమె ఆవిష్కరించారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ లేన క్వాడ్రాస్ జాతీయ బాలిక దినోత్సవ ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ డైరెక్టర్ బీఎస్ కోటేశ్వరరావు మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లోనూ రాణించాలని, విద్యను ఆయుధంగా మలుచుకొని జీవితంలో ఉన్నత స్థితికి చేరాలని కోరారు. మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వాసవి, కౌన్సిలర్ జీవన్ కుమార్, ప్రజా గాయకులు ఆర్.పిచ్చయ్య, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో–ఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.

పార్కింగ్ స్టాండ్‌లలో దారుణ దోపిడీ !

- విజయవాడ రైల్వేస్టేషన్ పార్కింగ్ స్టాండ్‌లలో అధికంగా వసూలు
- ధనార్జనే ధ్యేయంగా పార్కింగ్ నిర్వాహకులు
- అధ్వానంగా పార్కింగ్ నిర్వహణ
- ఎండ, వానకి పాడవుతున్న వాహనాలు



ప్రీమియం ద్విచక్ర వాహన పార్కింగ్‌లో ఎండలోనే వాహనాల పార్కింగ్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే స్టేషన్‌లో ద్విచక్రవాహనాల పార్కింగ్ స్టాండ్‌లు దోపిడీకి నిలయాలుగా మారాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా వసూలు చేస్తూ ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతున్నారు. కనీసం వాహనాల పర్యవేక్షణ సైతం పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వాహనాలు ఎందుకూ పనికిరాకుండా పోయే స్థితికి వస్తున్నాయని పలువురు అంటున్నారు. రైల్వే అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విజయవాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు, ఉద్యోగుల వాహనాలకు రక్షణ కల్పించే దిశగా పార్కింగ్ స్టాండ్‌ల నిర్వహణ బాధ్యతలను రైల్వే శాఖ కాంట్రాక్టర్లకు అప్పగించింది. ప్రయాణికుల నుంచి ప్రతి నెల రూ.లక్షల్లో ఆదాయం అందుకుంటున్న పార్కింగ్ నిర్వాహకులు మాత్రం వారి వాహనాల రక్షణలో కనీసం చర్యలు తీసుకోకపోవడం పట్ల పలువురు వాహన దారులు, ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారీగా వసూళ్లు....

స్టేషన్ తూర్పు ప్రవేశ ద్వారం వద్ద, రైల్వే ఆసుపత్రి పక్కన ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం స్థలం కేటాయించి వాటి నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టర్లకు అప్పగించింది. విజయవాడ రైల్వే స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన ప్రీమియం పార్కింగ్ స్టాండ్‌లో ప్రతి గంటకు రూ. 10, జీఎస్టీతో కలిసి రూ. 11.80 వసూలు చేస్తున్నారు. అదే విధంగా



రైల్వే ఆసుపత్రి పక్కన పార్కింగ్‌లో పైకప్పు చిరిగిపోవడంతో ఎండలోనే వాహనాలు



పార్కింగ్ ధరల పట్టిక

రైల్వే ఆసుపత్రి పక్కన ఏర్పాటు చేసిన ద్విచక్ర వాహనాల పార్కింగ్ స్టాండ్‌లో ఒక్కో వాహనం నుంచి మూడు గంటలకు రూ. 10 పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారు. మూడు గంటలు దాటితే ప్రతి గంటకు ఆదనంగా మరో పది రూపాయాలు, జీఎస్టీతో స్లాబ్ రేటు నిర్ణయించి మరీ ప్రయాణికుల నుంచి భారీగా వసూలు చేస్తున్నారు. కొన్ని సమయాల్లో ఇతర ప్రాంతాలకు వేళ్లే ప్రయాణికులు నాలుగు, ఐదు రోజులు పార్కింగ్ చేస్తే వారి పరిస్థితి వర్ణనాతీతంగా ఉంటుంది. దారుణంగా దోపిడీ చేస్తున్నారు.

ఎండకు ఎండి, వానకు తడవాల్సిందే...

గంట గంటకు స్లాబ్ రేటు నిర్ణయించి వాహనదారుల నుంచి అధిక మొత్తం వసూళ్లకు పాల్పడుతున్న పార్కింగ్ నిర్వాహకులు ప్రయాణికుల వాహనాల సంరక్షణ మాత్రం గాలికొదిలేశారు. పార్కింగ్ ప్రదేశాల్లో రక్షణ గోడలు, ఎండ, వానకు వాహనాలు తడవకుండా షెడ్లులు నిర్మాణం చేయాల్సి ఉంది. కానీ నిర్వాహకులు అవేమీ పట్టించుకోకుండా కేవలం డబ్బులు వసూళ్లకు మాత్రమే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు కనీసం షెడ్డు నిర్మాణం కూడా చేయకుండా ఎండలోనే పార్కింగ్ చేయిస్తున్నారు. అదే విధంగా రైల్వే ఆసుపత్రి పక్కన పార్కింగ్ ప్రదేశంలో అయితే తాత్కాలికంగా కర్టెన్‌లతో పైకప్పు ఏర్పాటు చేశారు. అదికాస్తా ఎండకు ఎండి చిరిగిపోయినా పట్టించుకోకుండా వాహనాలను పార్కింగ్ చేయిస్తు ఆదాయం అర్జిస్తున్నారు.

లోపించిన అధికారుల పర్యవేక్షణ...

ద్విచక్రవాహనదారుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లు చేసుకుంటూ వారి వాహనాల సంరక్షణ పట్టించుకోని పార్కింగ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాల్సిన రైల్వే కమర్షియల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఇటువంటి పరిస్థితి నెలకొంటుందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ప్రయాణికులు చెల్లించే డబ్బులకు కనీసం వారి వాహనాలకు రక్షణ కల్పించే దిశగా అధికారులు పర్యవేక్షించాలని వాహనదారులు కోరుతున్నారు.

జాతీయ క్రీడలకు వెళ్లిన రాష్ట్ర బీచ్ హ్యాండ్‌బాల్ జట్టు



జాతీయ క్రీడలకు పయనమైన రాష్ట్ర బీచ్ హ్యాండ్‌బాల్ జట్టు

విజయవాడస్పోర్ట్స్: ఉత్తరాఖండ్‌లో ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 38వ జాతీయ క్రీడలకు ప్రాతినిధ్యం వహించే ఆంధ్రప్రదేశ్ బీచ్ హ్యాండ్‌బాల్ జట్టు శుక్రవారం పయనమైనట్లు ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పి.సత్యనారాయణరాజు తెలిపారు. జట్టులో చోటు దక్కించుకున్న ఎస్.రాము(విశాఖపట్నం), ఎస్.అమీర్(విశాఖపట్నం), కె.శ్రీను(విశాఖపట్నం), ఎ.జగదీష్(కర్నూలు), కె.శివకుమార్(కర్నూలు), ఆర్.రియాజ్(కర్నూలు), ఎం.స్వామినాథన్(ప్రకాశం), కె.పవన్‌కల్యాణ్(చిత్తూరు), ఎల్.జనార్ధనరెడ్డి(గుంటూరు), ఇ.రాజు(అనంతపురం) విజయవాడ నుంచి బయలుదేరారు. ఈ బృందానికి ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్(ఏపీవోఏ) అధ్యక్షుడు ఆర్.కె.పురుషోత్తం ట్రాక్‌షూట్, కిట్లు, జెర్సీలు సమకూర్చారని, అలాగే తమ సంఘం ప్రయాణ ఖర్చులను సమకూర్చిందని సత్యనారాయణరాజు తెలిపారు. జట్టు బృందాన్ని కృష్ణాజిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వంశీకృష్ణ, కోచ్ గోపీకృష్ణ అభినందించారు.

పారిశుద్ధ్య కార్మికులకు ప్రాధాన్యం కల్పించాలి



వీఎంసీ పీఓకు వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): డ్వాక్రా గ్రూపుల ద్వారా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సీనియర్ కార్మికులకు నగరపాలక సంస్థ చేపట్టనున్న నియామకాల్లో ప్రాధాన్యం కల్పించాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి) నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా, అధ్యక్షులు ఎస్కేస్ చలం మినిస్టీరియల్ యూనియన్ అధ్యక్షుడు దారా రాంబాబు శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.వెంకట నారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు ఏళ్లుగా నగరంలో వివిధ సందర్భాలను పురస్కరించుకుని అదనపు పారిశుద్ధ్య కార్మికులు అవసరం అయినప్పుడు ఇతర ప్రాంతాల నుంచి పదుల సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులను రప్పించి పని చేయించుకుంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో నగరపాలక సంస్థ అదనంగా తీసుకోనున్న పారిశుద్ధ్య కార్మికుల పోస్టులకు ఎప్పటి నుంచో డ్వాక్రా గ్రూపులో ఉంటూ కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్నవారిని సీనియారిటీ ప్రకారం ప్రాధాన్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులను బీసీ–డీ నుంచి బీసీ–ఎ గ్రూపులోకి మార్చండి



బీసీ కమిషన్ చైర్మన్ శంకర్ నారాయణకు వినతి పత్రం ఇస్తున్న విష్ణువర్ధన్, నారాయణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో ప్రస్తుతం బీసీ – డీ గ్రూపులో ఉన్న ముదిరాజ్ సామాజికవర్గ ప్రజలను బీసీ – ఎ గ్రూపులోనికి మార్చాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎ.శంకర్ నారాయణ (రిటైర్డ్)కు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్దన్ ముదిరాజ్ (కైకలూరు), ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ముదిరాజ్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొర్న వెంకట నారాయణ ముదిరాజ్ (నెల్లూరు) కలిసి విజయవాడలోని రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ శంకర్ నారాయణను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ ముదిరాజ్ మాట్లాడుతూ ఇప్పుడు బీసీ – డీ గ్రూపులో ఉన్న తమ సామాజకవర్గం ఇంచుమించు అగ్రవర్ణాల జాబితాకు దగ్గరగా ఉన్నందున విద్య, ఉద్యోగం, ఆర్థిక అవకాశాలను అందిపుచ్చుకోలేక పోవడంతో జీవన స్థితిగతులు అస్తవ్యస్తంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కొర్న వెంకట నారాయణ, మహిళా అధ్యక్షురాలు ఝాన్సీ, బీసీ కమిషన్ సభ్యులు డాక్టర్ మారేష్, కైకలూరు నియోజకవర్గానికి చెందిన సర్పంచులు బోనం శేషగిరిరావు, పేరే రామకృష్ణ, గుంటూరు జిల్లా అధ్యక్షుడు గొడుగు శంకర్, తుమ్మ రామకృష్ణ, పరసా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డిజిటల్ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న నితిన్‌పాండే

పటమట/వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): డిజిటల్ యుగంలో వ్యక్తిగత సమాచార భద్రత అత్యంత కీలకమని సైబర్ సెక్యూరిటీ నిపుణుడు నితిన్ పాండే అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, గూగుల్.ఓఆర్ జి సహకారంతో కేబీఎన్ కళాశాల కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఫ్యాక్ట్ చెకింగ్ ఇన్ డిజిటల్ ఏజ్' అంశం మీద రెండు రోజుల సదస్సును ఆ కళాశాలలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న నితిన్ పాండే మాట్లాడుతూ డిజిటల్ సవాళ్ళను ఎదుర్కోవటం కోసం డీప్‌ఫేక్‌లు, నకిలీ వార్తలను గుర్తించగలిగిన నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. ఎథికల్ హ్యాకింగ్ ఇటీవల అధిక ప్రాధాన్యం సంతరించుకుందన్నారు. తప్పుడు సమాచారం అంతర్జాలం ద్వారా విపరీతంగా వ్యాపిస్తోందని చెబుతూ, దాన్ని గుర్తించే విధానాన్ని అనేక ఉదాహరణలతో వివరించారు. ప్రజెంటేషన్ల ద్వారా పాండే వివరించిన తీరు విద్యార్థులను డిజిటల్ భద్రత దిశగా చైతన్యవంతులను చేసింది. సైబర్ సురక్షా విధానాలను అనుసరించడం ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని అత్యంత భద్రంగా ఉంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వి. నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, ఎం.వెంకటేశ్వరరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి రవీంద్ర పాల్గొన్నారు.

ఎస్‌బీ ఏసీపీగా కిరణ్‌కుమార్, సౌత్ ఏసీపీగా పవన్‌కుమార్



సీపీ రాజశేఖరబాబు మొక్క అందజేస్తున్న ఎస్‌బీ ఏసీపీ కిరణ్‌కుమార్



సీపీ రాజశేఖరబాబుకు మొక్కను అందజేస్తున్న సౌత్ ఏసీపీ పవన్‌కుమార్

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా ఎస్.కిరణ్‌కుమార్, సౌత్ జోన్ ఏసీపీగా డి.పవన్‌కుమార్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్కను అందజేశారు.

26న కబేళాకు సెలవు

పటమట(విజయవాడతూర్పు): ఈ నెల 26న జాతీయ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నగరంలో మాంసం, చేపలు విక్రయాలను నిషేధించినట్లు వీఎంసీ ప్రజారోగ్య విభాగం ప్రధాన అధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. ఈ నెల 25 శనివారం రాత్రి నుంచి నగరంలో జంతు వధ నిషేధించామని పేర్కొన్నారు. నగరంలోని కబేళాకు సెలవు ప్రకటించటంతోపాటు, చేపలమార్కెట్లు, మాంసం మార్కెట్లు, అన్ని చికెన్, మటన్ షాపులు వారి వ్యాపారాలను నిలుపుదల చేయాలని ఆదేశించారు.

జాతీయ క్రీడల్లో సత్తా చాటండి

శాప్ చైర్మన్ రవినాయుడు



విజయవాడస్పోర్ట్స్: జాతీయ క్రీడల్లో సత్తా చాటాలని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు రాష్ట్ర ఖోఖో జట్టుకు సూచించారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఉత్తరాఖండ్‌లో ప్రారంభమయ్యే 38వ జాతీయ క్రీడలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టును శాప్ కార్యాలయంలో చైర్మన్ రవినాయుడు, ఎండీ గిరీషా శుక్రవారం అభినందించారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని వసతులను శాప్ సమకూర్చుతుందని, రాష్ట్రానికి పతకాలు సాధించేలా క్రీడాకారులు కష్టపడాలని చైర్మన్ అన్నారు. కార్యక్రమంలో శాప్ ఏఓ ఆర్.వెంకటరమణ నాయక్, ఏపీ ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ఆర్‌కే ప్రసాద్, ఎం.సీతారామరెడ్డి, జట్టు మేనేజర్ కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు



విజయవాడస్పోర్ట్స్: కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం 150 మంది అధికారులు, సిబ్బందికి పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ప్రశంసా పత్రాలను అందజేశారు. రోడ్డు ప్రమాద బాధితులకు(హిట్ అండ్ రన్ కేసుల్లో) జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి నష్టపరిహారం అనతి కాలంలోనే అందేలా చర్యలు తీసుకున్న, హెల్మెట్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించిన, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి చలానా రుసుమును వసూలు చేసిన, సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన పోలీసు అధికారులను, సిబ్బందిని సీపీ రాజశేఖరబాబు అభినందించారు. కార్యక్రమంలో డీసీపీలు తిరుమలేశ్వరరెడ్డి, ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు, ట్రాఫిక్ ఏసీపీ పి.రామచంద్రరావు, నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్ పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛదివస్‌కు తూట్లు



వైఎస్సార్ కాలనీ మెయిన్ రోడ్ చివర పేరుకుపోయిన చెత్త, వ్యర్థాల కుప్పలు



జక్కంపూడి పంచాయతీ పరిధిలోని ఖాళీ స్థలంలో చెత్త, వ్యర్థాలు

వైఎస్సార్, జక్కంపూడి కాలనీల్లో చెత్త కుప్పలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి సంబంధిత అధికారులు తూట్లు పొడుస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రతి మూడో శనివారం మాత్రమే ఆ కార్యక్రమం నిర్వహిస్తారా లేదా నిత్యం పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకుంటారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎందుకంటే నగర శివార్లలో విజయవాడ రూరల్ ప్రాంతంలో ఉన్న జక్కంపూడి, వైఎస్సార్ కాలనీల్లో చెత్త, వ్యర్థాల కుప్పలు పేరుపోయి స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని అపహాస్యం చేస్తోంది. కాలనీ ప్రధాన రహదారికి ఒక వైపు గొల్లపూడి పంచాయతీ పరిధిలో ఉండగా మరో వైపు జక్కంపూడి పంచాయతీ పరిధిలో ఉంది. అయినప్పటికీ మొత్తం మీద వైఎస్సార్ కాలనీగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలను విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు చూస్తున్నారా లేక ఆయా పంచాయతీల శానిటేషన్ అధికారులు చూస్తున్నారా అన్నది ఇప్పటికీ ప్రశ్నార్థకమే. కాలనీ వాసుల్లో కొందరు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రజారోగ్య విభాగం అంటే మరి కొందరు పంచాయతీల శానిటేషన్ విభాగమేనని చెబుతుండటం గమనార్హం. ఏది ఏమైనప్పటికీ రెండు పంచాయతీ పరిధుల్లో చెత్త కుప్పలు పేరుకుపోయి కనిపిస్తున్నాయి. గొల్లపూడి పంచాయతీ పరిధిలోగల చెరువు ఒడ్డునే చెత్త, వ్యర్థాలను పడేస్తుండగా జక్కంపూడి పంచాయతీ పరిధిలోని ఖాళీ స్థలంలో పడేస్తున్నారు. అసలే కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొని ఉన్న క్రమంలో దానికి తోడు అన్నట్లు చెత్త, వ్యర్థాల కుప్పలతో దోమలు పెరిగిపోయి అనారోగ్యం పాలవుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా రోగం వస్తే ప్రాథమిక చికిత్స తప్ప సరైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేదని వాపోతున్నారు.

భారతీ తీర్థ స్వామి జయంతి వేడుకలు ప్రారంభం



ఆదిశంకరులకు పూజాదికాలు నిర్వహిస్తున్న దృశ్యం



నవచండీ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన వేడుకలు దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను 75 రోజుల పాటు నిర్వహించనున్నారు. తొలుత వేదపండితులు జగద్గురు ఆదిశంకరుల విగ్రహాలకు పూజాదికాలు నిర్వహించారు. వేద పారాయణం, షోడశ పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విధుశేఖర భారతి మహాస్వామి ఆదేశంతో లోక సంరక్షార్థం నవచండీ హోమం, రుద్ర పారాయణం చేశారు. ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ నవచండీ హోమం అత్యంత శక్తివంతమైనదని తెలిపారు. లోకమాత చండీదేవిని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని వివరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా అంబటిపూడి రాధేశ్యాం గణేష పురాణం అంశంగా ప్రసంగించారు.

రేపు నూతన ఉచిత యోగ శిక్షణ శిబిరం ప్రారంభం

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక శాఖ శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో కృష్ణలంక, కాటూరివారి వీధిలోని సత్య పబ్లిక్ స్కూల్ బిల్డింగ్‌లో ఈ నెల 26వ తేదీ నుంచి 949వ ఉచిత యోగ శిక్షణా శిబిరం ప్రారంభిస్తున్నట్లు బోధక యోగాచార్యులు పోకూరి గోవర్ధనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6.30 గంటలకు శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. కుల, మత భేదం లేకుండా 8 నుంచి 80 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు శిక్షణలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి గల వారు 98481 53417, 94412 35384 నంబర్లలో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్, ఇతర అధికారులు

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగరంలో ఈ నెల 26న జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవం ఏర్పాట్లలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాని విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమ ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. బందరురోడ్డులో ఉన్న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే గణతంత్ర వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఓటర్ల దినోత్సవం లోనూ గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని ఆదేశించారు. వేడుకలకు వచ్చే ప్రజలకు సక్రమంగా తాగునీటి సరఫరా జరగాలని, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.